క్లుప్తంగా

శ్రీతిరుపతమ్మవారికి పండ్లతో అలంకరణ



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి యున్న శ్రీతిరుపతమ్మవారికి కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలురకాల పండ్లతో విశేషంగా అలంకరించారు. పండ్లతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. అలంకరణకు అవసరమైన పండ్లను విజయవాడకు చెందిన దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కల్పన దంపతులు సమకూర్చారని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని పాలుపొంగళ్లతో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. రమేష్‌నాయుడు, ఏఈవో ఉమాపతి, తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చందర్లపాడు పోలీస్ స్టేషన్ తనిఖీ



నందిగామ(చందర్లపాడు):స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఏసీపీ జనార్దన్‌నాయుడు సిబ్బందికి సూచించారు. చందర్లపాడు పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. స్టేషన్ లో సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎస్సై రామకృష్ణకు పలు సూచనలు చేశారు.

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

నందిగామ: తుఫాన్ నేపథ్యంలో మూడు రోజులపాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఏఎంసీ కార్యదర్శి ఎస్ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ ద్వారా నందిగామ ఏఎంసీలో చేపట్టిన పత్తి కొనుగోళ్లు తుఫాన్ నేపథ్యంలో సోమ, మంగళ, బుధ వారాల్లో నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులు గమనించి పత్తిని యార్డుకు తీసుకురావద్దని సూచించారు.

మద్దులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

గొట్టుముక్కల(కంచికచర్ల) : మండలంలోని గొట్టుముక్కల రిజర్వు ఫారెస్టులో కొలువై ఉన్న మద్దులమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు సంఖ్యలో తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పరిటాల గ్రామానికి చెందిన 500మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

స్విమ్మర్ల ఆత్మీయ సమ్మేళనం



జగ్గయ్యపేట అర్బన్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని తిరుమలగిరి రోడ్‌లో ఉన్న మామిడితోటలో ఆదివారం డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా స్విమ్మింగ్ కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి దంపతులను సభ్యులు ఘనంగా సన్మానించారు.డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మండదపు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో ముమ్మరంగా వరికోతలు



వరి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కల్లాల్లోకి తరలిస్తున్న రైతులు

నందిగామ: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులలో ఆందోళన మొదలైంది. ముఖ్యంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వర్షం పడితే కోత దశలో ఉన్న ధాన్యం దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నందిగామ నియోజకవర్గ నాలుగు మండలాల పరిధిలో వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం రైతులు ఈ ఏడాది 14,101 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఇప్పటికే కొంతమంది రైతులు వరికోతలు చేపట్టగా, తుఫాన్ నేపథ్యంలో వర్షం పడితే పంట చేతికందదేమోనని ఆందోళన చెందుతున్న రైతులు వరికోత యంత్రాలు ఏర్పాటు చేసుకుని కోతలు చేపట్టారు. ధాన్యం తడవకుండా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

సమానత్వానికి ప్రతీకలు వన సమారాధనలు

ప్రభుత్వ విప్ ఉదయభాను



పెనుగంచిప్రోలులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

పెనుగంచిప్రోలు: కార్తిక వన సమారాధనలు సమానత్వాన్ని ప్రతిబింబించే ప్రతీకలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పవిత్ర కార్తికమాసాన్ని పురస్కరించుకుని స్థానిక మునేరు అవతల కంఠంనేని గార్డెన్స్‌లో సామినేని విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ముందుగా ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయా పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ డిసెంబర్ 15నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 15ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఆయా పోటీల్లో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను అన్ని రంగాల్లో ఎంతో ప్రోత్సాహిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను రెండోసారి సీఎంగా చేసుకునేందుకు, జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా ఉదయభానును మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైఎస్సార్‌సీపీ పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, గుత్తా శంకరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేనికుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వత్సవాయి ఎంపీపీ కె.రమాదేవి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.



వనసమారాధనకు హాజరైన నాయకులు, ప్రజలు



నృత్యం చేస్తున్న చిన్నారులు



మున్నేట్లో సరదాగా గడుపుతున్న వనయాత్రీకులు

మున్నేటి తీరంలో సమారాధనల సందడి

నందిగామ: కార్తికమాసం నేపథ్యంలో పట్టణ శివారు మున్నేటి తీరం వనయాత్రకు వచ్చిన వారితో ఆదివారం సందడిగా కనిపించింది. మున్నేటి తీరంలోని పలు మామిడి తోటలలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా సామాజికవర్గాలకు చెందినవారు పెద్ద సంఖ్యలో కార్తిక వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈనేపథ్యంలో సాయంత్రం సమయంలో మున్నేరు, పరిసర ప్రాంతాలు వనయాత్రీకులతో సందడిగా మారాయి.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి పద్మజ, ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్:గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో మండలంలోని లింగాలపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థలు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలతో పేదలకు ఎంతో మేలుకలుగుతోందన్నారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం సేవా సంస్థల సభ్యులు ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, సర్పంచ్ బొల్లినేని పద్మజ, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం



కంచికచర్లలో బీఎల్ఓల నుంచి వివరాల సేకరిస్తున్న తహశీల్దార్ శంకర్‌బాబు

కంచికచర్ల : రెండురోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. కంచికచర్లలోని ఓటరు నమోదు కేంద్రాన్ని తహశీల్దార్ పి.శంకరబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శంకరబాబు మాట్లాడుతూ రెండురోజులుగా బీఎల్‌వోలు ఆయా కేంద్రాల్లో ఓటరు నమోదు అర్జీలు స్వీకరించారని చెప్పారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. మండలంలోని 16 గ్రామాల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు నమోదు కోరుతూ 49, తొలగింపు కోసం ఐదు, సవరణలు కోరుతూ 21 అర్జీలు అందినట్లు తహశీల్దార్ వివరించారు. కార్యక్రమంలో డీటీ షేక్ నాగుల్‌మీరా, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రాల తనిఖీ

జగ్గయ్యపేట అర్బన్: ఓటరు జాబితాల్లో తప్పులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జగ్గయ్యపేట తహశీల్దార్ సూర్యారావు సూచించారు. జగ్గయ్యపేట పట్టణంతోపాటు మండలంలోని తక్కెళ్లపాడు, అనుమంచిపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటు నమోదు కోసం 708 అర్జీలు, ఓటు తొలగింపు కోసం 96 అర్జీలు, ఓటర్ల జాబితాలో సవరణ కోసం 159 అర్జీలు కలిపి మొత్తం 963 అర్జీలు అందినట్లు తహశీల్దార్ తెలిపారు.

మిర్చి సాగు.. బాగుబాగు

- వర్షాలకు జీవం పోసుకున్న మిర్చి పంట
- దిగుబడులు, లాభాలపై రైతుల ఆశలు
- నందిగామ నియోజకవర్గంలో 10,100 ఎకరాల్లో సాగు




కంచికచర్ల మండలం గండేపల్లిలో సాగవుతున్న మిర్చి పంట

కంచికచర్ల : గతేడాది కాసుల వర్షం కురిపించిన మిర్చిసాగుపై రైతులు ఈసారి లాభాలపంట పండిస్తుందని రైతులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో నాణ్యమైన దిగుబడులు వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. నందిగామ నియోజకవర్గంలో నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో కలిపి సుమారు 10, 100 ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేపట్టారు.

గతేడాది రూ.26వేలు పలికిన ధర..

గతేడాది మిర్చి నాణ్యత ఆధారంగా క్వింటా మిర్చి రూ. 26వేల వరకు పలికింది. దీంతో ఈ ఏడాది మిర్చిసాగుపై రైతులు ఆసక్తిచూపి గతేడాది కంటే అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టారు. గతేడాది ఎకరాకు రకాన్ని బట్టి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం, ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులకు లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది రెట్టించిన ఉత్సాహంతో మిర్చి సాగు చేపట్టారు. సీజన్ ప్రారంభంలో వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో రైతులు దిగాలు చెందగా, ఇటీవల కురిసిన వర్షాలు పంటకు ఊపిరినిచ్చాయి. పైర్లు పచ్చబడ్డాయి. రైతుల ఆశలు చిగురించాయి. ఈ ఏడాది మిర్చి పంట దిగుబడులు గతంలో కన్నా బాగా పెరిగే అవకాశాలున్నాయని రైతులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు సుమారు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు. మిర్చి పంటకు తెగుళ్ల ఆశించకుండా ప్రభుత్వం రాయితీపై అందించే లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారులు సూచించారు.


మంచి దిగుబడులు వస్తాయి..



ఈ ఏడాది మూడు ఎకరాల్లో మిర్చిపంటను సాగుచేశా. ఇటీవల కురిసిన వర్షాలకు పైరు బాగుంది. మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. గతేడాది ఎకరాకి 16 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడంతో లాభాలు చూశాం. అందుకే ఈ ఏడాది కూడా మిర్చి పంటను సాగుచేశా.

– గుదే కృష్ణారావు, రైతు, గనిఆత్కూరు

తెగుళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి..



మిర్చి పంటలో తామర పురుగు ఎక్కువగా కనిపిస్తోంది. కేవలం సూక్ష్మ పోషకాల లోపం వల్ల తెగుళ్లు ఆశిస్తున్నాయి. కొన్నిచోట్ల ఆకుముడత ఉందని, బొబ్బర, ముడత తెగుళ్లకు మందులు పిచికారీ చేస్తున్నారు. నివారణకు సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. ఒక లీటర్ నీటిలో ఫార్ములా–6ను ఐదు గ్రాములు కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో మూడు నుంచి నాలుగుసార్లు పిచికారీ చేస్తే సరిపోతుంది.

– నీలిమ, ఉద్యానశాఖ అధికారి, కంచికచర్ల

నందిగామలో 1028 అర్జీలు




నందిగామ: నందిగామ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు, ప్రచార దినోత్సవం రెండవ రోజు ఆదివారం కూడా కొనసాగింది. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలు విధులు నిర్వహించారు. ఆర్డిఓ పి సాయిబాబు కంచికచర్ల, వీరులపాడు మండలాలల్లో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. రెండోరోజు నియోజకవర్గంలో మొత్తం 1028 అర్జీలు అందినట్లు ఆర్డీవో తెలిపారు. ఓటరు నమోదు కోరుతూ నందిగామ నియోజకవర్గంలో 658 అర్జీలు, ఓట్ల తొలగింపు కోసం 113, ఓటర్ల జాబితాలో సవరణలు కోరుతూ 257అర్జీలు అందినట్లు ఆయన వివరించారు. నందిగామ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలోని కానుకల చోరీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీ బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో హుండీలోని కానుకలు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు ఆలయంలో పరిచారకునిగా పనిచేస్తున్న పరాశరం ముకుంద్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే పరాశరం ముకుంద్ శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆలయంలోని హనుమంతుని ఉపాలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు వచ్చి ఉపాలయం తలుపు తెరిచి లోపల శుభ్రం చేసి బయటకు వస్తుండగా కింద చిల్లర నాణెలు కనిపించాయి. వాటిని పరిశీలిస్తూ అక్కడే ఉన్న స్టీల్ హుండీ వైపు చూడగా దాని తాళాన్ని కోసి ఉన్నట్లు గుర్తించారు. హుండీలోని కానుకలను పరిశీలించగా అవి పూర్తిగా ఎవరో దొంగిలించినట్లు గ్రహించాడు. దానిపై ఆలయ ప్రధాన అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తికి, అలాగే ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచనల మేరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో పది వేల రూపాయల వరకూ నగదు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఆలయానికి చేరుకొని సీసీ పుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధుమేహంపై మరింత అప్రమత్తత అవసరం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ సదాశివరావు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): రోజు రోజుకు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న మధుమేహం విషయంలో మరింత అప్రమత్తత అవసరమని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ, వైడీఆర్‌ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో మధుమేహం, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించి సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలువురు నిపుణులు పాల్గొని మధుమేహంతో పొంచి ఉన్న విపత్తు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. మనదేశంలో ప్రీ డయాబెటీస్ ఆందోళన కరస్థాయిలో పెరిగిపోతుందన్నారు. ఈ సదస్సులో నగరానికి చెందిన మధుమేహ నిపుణులు డాక్టర్ వై.సదాశివరావు కీలక ఉపన్యాసం చేయగా, దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ప్రమోద్, వైద్యులు శివరామ్, హిమన, ఐశ్వర్య, అమూల్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతను చాటుదాం

ఎమ్మెల్సీ అరుణకుమార్



వీరులపాడు మండల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



పోతురాజుకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

జుజ్జూరు(వీరులపాడు): నందిగామలో ఈనెల ఐదోతేదీన జరుగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టంగా ఉందని చాటిచెబుదామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఆపార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని జుజ్జూరులో సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించి ఆదివారం రాత్రి ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నందిగామ గాంధీ సెంటరులో నిర్వహించే బహిరంగ సభకు వీరులపాడు మండలం నుంచి వేలాదిగా పాల్గొని సాధికారయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, నాయకులు పూలా పుల్లయ్య, తమ్మిశెట్టి కొండ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోతురాజుకు ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

నందిగామ టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయరంగం మునుపెన్నడూలేని అభివృద్ధిని సాధించిందని ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. నందిగామ పట్టణ సమీపంలోని అనాసాగరంలో రైతులతో కలిసి పోతురాజుస్వామికి ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ వరిపంట కోతలకు ముందు రైతులు పోతురాజుస్వామికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ పూజా కార్యక్రమంలో రైతులు తనను కూడా భాగస్వామిని చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాములపాటి రమేష్, కర్రి రవీంద్ర, చాపల మల్లికార్జునరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాధికారయాత్రను విజయవంతం చేయాలి



గండేపల్లిలో మాట్లాడుతున్న సర్పంచి బొక్కా రవికుమార్

కంచికచర్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నివర్గాల ప్రజలకు అనేక మేలులు జరిగాయని గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లిలో పార్టీ నాయకులతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈమేరకు సర్పంచి మాట్లాడుతూ ఈ నెల ఐదో తేదీన నందిగామలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఎం జగనన్న పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలకు మతం, కులం, ప్రాంతం చూడకుండా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతున్నాయన్నారు. నందిగామలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. సాధికారయాత్రకు గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచి బీ సుబ్బారావు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సాధికార యాత్రకు తరలిరండి..

పెద్దాపురం(వీరులపాడు):నందిగామలో ఈ నెల ఐదో తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలంతా తరలిరావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు పిలుపునిచ్చారు. పెద్దాపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు ఈ సాధికారయాత్రను నిర్వహిస్తున్నారని చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరు తమ శక్తి మేరకు సాధికారయాత్ర విజయవంతానికి కృషి చేయాలని కోరారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా నందిగామకు చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో పి.సాయిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని ఆయా మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10గంటల నుంచి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరుగుతుందని తహశీల్దార్ పి.శంకరబాబు ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తామని తహశీల్దార్ వివరించారు.

సంబరాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు



తుర్లపాడులో కాంగ్రెస్, టీడీపీ జెండాలతో ర్యాలీ చేస్తున్న ఆపార్టీల కార్యకర్తలు

నందిగామ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో నందిగామ నియోజకవర్గంలో పలుచోట్ల కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నందిగామ పట్టణంలోని గాంధీసెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చారు. కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. చందర్లపాడు మండలం తుర్లపాడులో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో టీడీపీ కార్యకర్తలు కూడా పాల్గొని తమ జెండాలను ప్రదర్శించారు. దీంతో ఈ విషయం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ సంబరాల్లో పీసీసీ సభ్యుడు కాలేటి సతీష్, గింజుపల్లి అనిల్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాయామంతో శారీరక ఆరోగ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా జీవించవచ్చునని స్పెషల్ బ్రాంచ్ అదనపు డీసీపీ లక్ష్మీపతి అన్నారు. ప్రతి రోజూ స్విమ్మింగ్, నడక, సైక్లింగ్ వంటి వాటిలో ఏదోఒకటి చేయాలని ఆయన సూచించారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ రైట్‌ను ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎంజీ రోడ్డులో ఏడీసీపీ లక్ష్మీపతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవితానికి మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం అవసరమన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు స్విమ్మింగ్, సైక్లింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. మాజీఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ అక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.